సాక్షి
నంద్యాల
మంగళవారం, 19, మార్చి, 2024



శాస్త్రోక్తంగా వెండి రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులను సోమవారం వెండి రథంలో ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. ముందుగా సహస్రదీపార్చన జరిపారు.



మల్లన్నకు నృత్యనీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యకళావేదికపై సోమవారం గుంటూరుకు చెందిన నాగశ్రీ ప్రవల్లిక వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.



యువకుడి దారుణహత్య

చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం నిర్వహించిన వేలంపాటలో వివాదం తలెత్తింది. ఇరువర్గాల ఘర్షణలో ఓ యువకుడి హత్యకు గురయ్యాడు. 8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:32	ఉ॥ 5:00
ఆదోని	సా॥ 6:35	ఉ॥ 5:03
నంద్యాల	సా॥ 6:32	ఉ॥ 4:57
ఆత్మకూరు	సా॥ 6:30	ఉ॥ 4:58
బనగానపల్లె	సా॥ 6:33	ఉ॥ 4:58

హదీస్ వెలుగు :

రోజా దీక్ష ఉండి హలాల్ ఆహారంతోనే ఇఫ్తార్ చేయండి. హరామ్ ఆహారంతో ఇఫ్తార్ చేస్తే పగలంతా పస్తు ఉండటం తప్ప పుణ్యం లభించదు. – పవిత్ర ఖురాన్

తమ్ముళ్ల తిరకాసు.. జనసేన చెల్లని కాసు..!

అభ్యర్థులను తేల్చని టీడీపీ

- ఆలూరు, ఆదోని విషయంలో మీనమేషాలు
- జనసేనకు ఉమ్మడి జిల్లాలో మొండిచేయి
- ఆలూరు టిక్కెట్‌పై డీఎస్పీ ఆశలు గల్లంతు
- ఆదోనిలో గందరగోళంగా మీనాక్షినాయుడి భవితవ్యం
- ఇండిపెండెంట్‌గా పోటీకి సిద్ధమైన తిక్కారెడ్డి
- ఎంపీ సీట్ల విషయంలోనూ స్పష్టత కరువు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: సార్వత్రిక సమరంలో అధికార పార్టీ అభ్యర్థులు ప్రచారపర్వంలో దూసుకుపోతుంటే.. 'కూటమి'కి ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అభ్యర్థులే ఖరారు కాని పరిస్థితి. ఆదోని, ఆలూరు అసెంబ్లీలతో పాటు కర్నూలు, నంద్యాల ఎంపీ స్థానాలకు అభ్యర్థులు కరువయ్యారు. దీంతో నంద్యాల ఎంపీగా బీజేపీ నేత బైరెడ్డి శబరికి టిక్కెట్ ఇచ్చేందుకు అంగీకరించి 'సైకిల్' ఎక్కించారు. టిక్కెట్ ఖరారైన తర్వాత శబరి పచ్చకండువా వేసుకున్నారు. ఇక ఇప్పటి వరకు కర్నూలు ఎంపీ, ఆలూరు, ఆదోనికి అభ్యర్థుల విషయంలో స్పష్టత కరువైంది.

డీఎస్పీకి చేయిచ్చిన బాబు

ఆలూరు బరిలో బోయ కులానికి చెందిన ఓ డీఎస్పీని నిలపాలని చంద్రబాబు ఆ సామాజిక వర్గంలో ఆశలు రేకెత్తించారు. ఉద్యోగానికి రాజీనామా చేయాలని కూడా డీఎస్పీకి సూచించారు. అయితే చంద్రబాబు స్వభావం తెలిసి టిక్కెట్ ఖరారైన తర్వాత రాజీనామా చేయొచ్చని ఆయన వేచి చూశారు. పోలీస్‌శాఖలో తన బ్యాచ్‌మెట్లు, తన దగ్గర పని చేసే సిబ్బందితో తాను ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లుగా పెద్ద ఎత్తున ప్రచారం కూడా చేసుకున్నారు. ఎన్నికలకు చందాలు కూడా అడిగారు. అయితే తీరా మంత్రాలయం టిక్కెట్ బోయ వర్గానికి చెందిన రాఘవేంద్రకు కేటాయించారు. దీంతో ఆలూరులో బోయలకు మొండి చేయి చూపినట్లయింది. ఈ కారణంగా ఎమ్మెల్యే కావాలని ఉవ్విళ్లూరిన డీఎస్పీ ఆశలు అడియాశలయ్యాయి.

ఇండిపెండెంట్‌గా తిక్కారెడ్డి

మంత్రాలయంలో టీడీపీని మొదటి నుంచి అంటిపెట్టుకుని, పార్టీ కోసం భారీగా డబ్బు ఖర్చు చేసి నష్టపోయిన తిక్కారెడ్డికి చంద్రబాబు హ్యాండిచ్చారు. అతన్ని కాదని రాఘవేంద్రకు టిక్కెట్ ఖరారు చేశారు. ఈ నిర్ణయాన్ని అతని సామాజికవర్గంతో పాటు నియోజకవర్గంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎవ్వరూ స్వాగతించలేదు. తామంతా తిక్కారెడ్డితోనే నడుస్తామని తేల్చిచెప్పారు. ఆయనకే టిక్కెట్ ఇవ్వాలని ఆందోళనలు చేశారు. అయితే టీడీపీ మాత్రం తిక్కారెడ్డిని పిలిపించి మాట్లాడే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో 'పార్టీలో ఉంటే ఉండు లేదంటే లేదు!' అనేలా వ్యవహరించింది. ఈ నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై తన అనుచరులతో ఆయన సమావేశమయ్యారు. కాంగ్రెస్ తరఫున పోటీ చేయాలని మొదట భావించినా, చివరకు ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగాలని, తన బలం చూపించాలని నిర్ణయం తీసుకున్నారు. కేడర్ కూడా పూర్తి మద్దతు తెలపడంతో పోటీకి సిద్ధమయ్యారు.

మీనాక్షి నాయుడి భవిష్యత్తు ఏంటో?!

టీడీపీలో మీనాక్షినాయుడుకు టిక్కెట్ లేదనే సంకేతాలు పంపారు. టిక్కెట్ ఇవ్వాలని ఆయన అనుచరులు ఆందోళనలు చేస్తున్నారు. టీడీపీ ఫ్లెక్సీలను కూడా తొలగించారు. అయితే ఆ సీటు బీజేపీకి ఇస్తుండటంతో మీనాక్షినాయుడు ఆలోచనలో పడ్డారు. వయస్సు పైబడింది. తన కుమారుడికి టిక్కెట్ ఇప్పించుకోలేకపోయాడు. దీంతో తన రాజకీయ భవిష్యత్తు ఏంటని ఆలోచించి చివరకు ఇండిపెండెంట్‌గా పోటీ చేద్దామా? అని అనుచరులతో చర్చిస్తున్నారు. బీజేపీకి టిక్కెట్ ఖరారైతే ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది.



'పచ్చ'జెండా మోసేందుకే జనసైనికులు

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 45వేలు, నంద్యాలలో 38వేలు, డోన్, బనగానపల్లి, ఆత్మకూరుతో పాటు కర్నూలు జిల్లాలో కూడా బలిజలు అధిక సంఖ్యలో ఉన్నారు. అయితే నంద్యాల జిల్లాలో ఒక్క సీటు కూడా జనసేనకు టీడీపీ కేటాయించలేదు. కర్నూలు జిల్లా ఆదోని సీటుపై ఆశలు పెట్టుకున్నప్పటికీ సీటు ఇవ్వలేమని చంద్రబాబే స్పష్టం చేసినట్లు తెలిసింది. అక్కడ బీజేపీకి టిక్కెట్ ఇచ్చే యోచనలో ఉన్నారు. దీంతో 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనసైనికులు టీడీపీ జెండా పట్టుకుని చంద్రబాబు విజయం కోసం పనిచేయడం మినహా తాము జనసేనలో ఉన్నందుకు ఒక్కరికైనా టిక్కెట్ దక్కించుకునే పరిస్థితి లేదు. ఉమ్మడి జిల్లా బ్యాలెట్లలో ఎక్కడా 'గ్లాసు' గుర్తు కన్పించని పరిస్థితి ఉండనుంది.

ఎటూ తేలని ఎంపీ అభ్యర్థులు

కర్నూలు, నంద్యాల పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితి టీడీపీది. నంద్యాలలో మాండ్ర శివనందరెడ్డికి సర్వేలు దెబ్బకొట్టాయి. అతను డబ్బున్న వ్యక్తి మాత్రమే అని, రాజకీయంగా ఏమాత్రం ప్రభావితం చేయలేడని తేలింది. దీంతో బైరెడ్డి రాజశేఖరరెడ్డి కుమార్తె, బీజేపీ నేత శబరికి ఎంపీ టిక్కెట్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇటీవలే ఆమె బీజేపీని వీడి టీడీపీలో చేరారు. త్వరలో అభ్యర్థిగా ప్రకటించనున్నారు. దీంతో మాండ్ర శివానందరెడ్డి చట్టసభలకు వెళ్లాలనే ఆశలు దాదాపుగా సమాధి అయినట్లే. మరోవైపు కర్నూలు ఎంపీగా అభ్యర్థులే దొరకని పరిస్థితి. డబ్బున్న చాలామంది పేర్లను పరిశీలించిన బాబు చివరగా పంచలింగాల నాగరాజు, హర్యానా గవర్నర్ దత్తాత్రేయ పీఏ భానుశంకర్‌లో ఒకరికి టిక్కెట్ ఇవ్వాలని భావించారు. చివరకు కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్ టీడీపీలో చేరడంతో చేనేత కోటాలో ఆయనకు టిక్కెట్ ఇవ్వొచ్చనే ప్రచారం కొనసాగుతోంది. ఈ ముగ్గురిలో ఒకరు బరిలో నిలవనున్నట్లు సమాచారం.

ఎన్నికల విధులను అప్రమత్తంగా నిర్వర్తించండి

- జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినందున ఎన్నికల నిర్వహణ విధులను అప్రమత్తంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి నోడల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పోలింగ్ విధుల నిర్వహణకు కాంట్రాక్ట్ సిబ్బంది మినహా ఇంకా ఏదేని శాఖల సిబ్బందిని గుర్తించి మంగళవారం సాయంత్రంలోగా ఇవ్వాలన్నారు. అలాగే రాండమైజేషన్ పద్ధతిలో విధులు నిర్వహణకు షెడ్యూల్ తయారు చేసుకోవాలన్నారు. పోలింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు ట్రైనింగ్ షెడ్యూల్‌ను పక్కగా రూపొందించుకోవాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లకు కేటాయించే వీడియో గ్రాఫర్లకు మంగళవారం శిక్షణ ఇవ్వాలని సూచించారు. పోలింగ్ శాతం తక్కువగా ఉన్న పోలింగ్ స్టేషన్ల పరిధిలో కారణాలు విశ్లేషించి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటర్లలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వృద్ధ ఓటర్లు, వికలాంగ ఓటర్లు, సర్వీస్ ఓటర్లకు వర్తించే పోస్టల్ బ్యాలెట్ పత్రాలపై కూడా ట్రైనింగ్ ఇవ్వాలన్నారు. ఎన్నికల పరిశీలన నిమిత్తం వచ్చే అబ్జర్వర్లకు వసతి, లైజన్ ఆఫీసర్ల కేటాయింపుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. భారత ఎన్నికల సంఘం సూచించిన అన్ని అంశాలపై అప్రమత్తంగా ఉండి విధులను నిర్వహించాలని నోడల్ అధికారులకు సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ పద్మజ, అన్ని కమిటీల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'సూపర్ నేపియర్'తో గ్రాసం కొరతకు చెక్

నంద్యాల(సెంట్రల్): సూపర్ నేపియర్ గడ్డి సాగుతో పశుగ్రాసం కొరత చాలా వరకు తీరుతుందని నంద్యాల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు వెంకటసుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోజుకు 30 కేజీల ఈ రకం గడ్డిని పశువుకు అందిస్తే పాల దిగుబడి పెరగడంతో పాటు, ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఎండలు తీవ్రత పెరుగుతుండటంతో మూగజీవాల విషయంలో పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పశువులను మేతకు తీసుకువెళ్లాలని, ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున సాయంత్రం వేళల్లో చెరువులు, కుంటల్లో పశువులను ఆపడంతో డీహైడ్రేషన్‌కు గురి కాకుండా చూసుకోవచ్చున్నారు. పశువుల పాకలు చల్లగా ఉండే విధంగా స్ప్రింక్లర్లు ఏర్పాటు చేయడం లేదా నీటిని చల్లించడం చేయాలన్నారు. ఎండ వేడిమితో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే సమీపంలోని పశువైద్యులను సంప్రదించాలని సూచించారు.

కార్డుదారులకు జొన్నలు

నంద్యాల(అర్బన్): రేషన్ కార్డు దారులకు ఏప్రిల్ మాసంలో బియ్యంకు బదులుగా మూడు కేజీల జొన్నలు అందజేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. మార్చి నెలలో 767.790 మెట్రిక్ టన్నుల జొన్నలను 2,89,996 మంది కార్డు దారులకు అందజేశామన్నారు. అదే మాదిరిగా ఏప్రిల్ మాసంలోనూ ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేయనున్నామన్నారు. కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పంట రుణాల పరిమితి 30 శాతం పెంపు

నంద్యాల(సెంట్రల్): 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను పంట రుణాల పరిమితిని ప్రభుత్వం పెంచిందని నంద్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాదితో పోలిస్తే 30 శాతం పెరుగుదలతో బ్యాంకులు ఏప్రిల్ 1 నుంచి రుణాలు మంజూరు చేయనున్నాయని పేర్కొన్నారు. పెంచిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌పై ఆర్బీకే స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ముఖ్యంగా వరికి రూ.42 వేల నుంచి రూ.46 వేలకు, మొక్కజొన్నకు రూ.42 వేల నుంచి రూ.45 వేలకు, మిరపకు రూ.90 వేల నుంచి రూ. 95 వేలకు పెంచినట్లు తెలిపారు. వ్యవసాయంతో పాటు పాడి, పౌల్ట్రీ రైతన్నలకు సైతం రుణ పరిమితిని ప్రభుత్వం పెంచిందన్నారు. భూ యజమానులతో పాటు కౌలుదారులకు సైతం పెంచిన రుణ పరిమితి వర్తిస్తుందని వివరించారు.

పేదోడి ప్రాణం నిలిచింది



గుండెపోటు వచ్చిన వ్యక్తికి ఖరీదైన ఇంజెక్షన్ చేస్తున్న డాక్టర్ మహేశ్వరరెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: పేదలకు నాణ్యమైన వైద్యం చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. అవసరమైన సిబ్బంది, ఖరీదైన మందులను అందుబాటులో ఉంచడంతో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. ఇందుకు సోమవారం సున్నిపెంటలో జరిగిన సంఘటనే నిదర్శనం. స్థానిక బండ్లబాజర్ ప్రాంతానికి చెందిన వెంకట చెన్నయ్య సోమవారం రోజులాగే క్వారీలో రాళ్లు కొట్టేందుకు కూలీకి వెళ్లాడు. ఉదయం 11 గంటల సమయంలో అకస్మాత్తుగా కాలు, చేయి చచ్చుబడి కూలబడ్డాడు. తోటి కూలీలు వెంటనే సున్నిపెంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అక్కడ డాక్టర్ భూమా మహేశ్వరరెడ్డి, స్టాఫ్‌నర్స్ సౌభాగ్యమ్మ, అనిత, సిబ్బంది అతనికి పరీక్షలు జరిపి గుండెపోటుగా నిర్ధారించారు. కాగా ఆసుపత్రుల్లో గుండెపోటు వచ్చిన వారికి అత్యవసరంగా ఇచ్చే రూ.45,000 విలువైన టెనెక్టెప్లేస్ 40ఎంజీ ఇంజెక్షన్‌ను ఉచితంగా వేసి ప్రాణాలను నిలబెట్టారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ అన్ని సీహెచ్‌సీలలో ఖరీదైన ఇంజెక్షన్లు రెండు చొప్పున అందుబాటులో ఉంటాయన్నారు. సున్నిపెంట జిల్లా కేంద్రం నంద్యాలకు సుదూరంగా ఉండడం, గిరిజన ప్రాంతం కావడంతో 10 ఇంజెక్షన్లు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

గోల్డ్ మైనింగ్ భూముల పరిశీలన

తుగ్గలి: పగిడిరాయి వద్ద ఏర్పాటైన జియో మైసూర్ గోల్డ్ మైనింగ్ కంపెనీ పరిధిలోని భూములను సోమవారం పత్తికొండ ఆర్డీవో ఎస్ రామలక్ష్మి పరిశీలించారు. వివిధ కంపెనీలు గత 45 ఏళ్లుగా సర్వే చేసి ఈ ప్రాంతంలో 597.82 హెక్టార్లలో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించాయి. జియోమైసూర్ సర్వీసెస్ ప్రవేటు లిమిటెడ్ కంపెనీ 2013లో అనుమతులు పొంది 30 ఎకరాల్లో రూ.200కోట్లతో గోల్డ్ మైనింగ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. మైనింగ్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆర్డీవో పరిశీలించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన, లీజుకు తీసుకున్న భూముల వివరాలు, సర్వే నంబర్లు తదితర వాటిపై కంపెనీ పీఆర్‌వో రామ్మోహన్‌రెడ్డితో ఆరా తీశారు. మైనింగ్‌లో పనిచేసే కార్మికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్లాంట్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆర్డీవో వెంట తుగ్గలి తహసీల్దార్ షర్మిల, ఆర్‌ఐ సుధాకరరెడ్డి, వీఆర్వో రంగన్న ఉన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

- ఈ నెల 31 వరకు తుది గడువు
- ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష
- ఒక్కో పాఠశాలలో 100 సీట్లు



ఆళ్లగడ్డ ఏపీ మోడల్ స్కూల్

ఆళ్లగడ్డ/గోస్పాడు: జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 ఏపీ మోడల్ స్కూళ్లలో 2024– 25 విద్యాసంవత్సరానికి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. 6వ తరగతిలో ప్రవేశాలు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఆరో తరగతిలో సీటు సాధిస్తే ఇంటర్ మీడియెట్ వరకు ఎటువంటి ఫీజులు లేకుండా ఉచితంగా ఆంగ్ల మీడియంలో విద్యనభ్యసించవచ్చు. ప్రస్తుతం ఇందులో చేరేందుకు పోటీ పెరగడంతో ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. గతంలో ఏటా 6వ తరగతిలో ఒక్కో పాఠశాలలో 80 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలు కల్పించేవారు. ప్రస్తుతం అడ్మిషన్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు పోటీ పడుతుండటంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వాటిని 100 సీట్లకు పెంచడం జరిగింది. దీంతో ప్రస్తుతం ఒక్కో పాఠశాలలో ఆరో తరగతిలో అదనంగా 20 మంది ప్రవేశాలు పొందే అవకాశం ఉండటంతో జిల్లాలోని 20 పాఠశాలల్లో 400 మంది విద్యార్థిని, విద్యార్థులకు అదనంగా అవకాశం లభిస్తోంది. www.cse.ap.gov.inలేక https// schooledu.ap.gov.in/AP&CBSE&School/28213801805 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీలకు రూ. 150, ఎస్సీ, ఎస్టీలకు రూ. 75 గా పరీక్ష ఫీజు నిర్ణయించారు. ఓసీ, బీసీలకు 35, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు పొంది ఉండాలి. ఇందులో పొందిన మార్కులు రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుంది.

ప్రవేశ పరీక్ష షెడ్యూల్

- జిల్లాలో ఏపీ మోడల్ స్కూళ్లు: 20
- ఆన్‌లైన్ దరఖాస్తు: ఈనెల 31వ తేదీ వరకు
- పరీక్ష తేదీ: ఏప్రిల్ 21
- పరీక్ష సమయం: ఉదయం 10 నుంచి 12 గంటల వరకు
- ఫలితాల ప్రకటన: ఏప్రిల్ 27
- పాఠశాలల వారీగా ఎంపికైన వారి జాబితా ప్రదర్శన : ఏప్రిల్ 29
- సర్టిఫికెట్ల వెరిఫికేషన్: ఏప్రిల్ 30
- తరగతుల నిర్వహణ: జూన్ 12

'పది' పరీక్షలు ప్రారంభం



నంద్యాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి

- మొదటిరోజు 93.85 శాతం మంది విద్యార్థుల హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలు మొదటిరోజు కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంతో సందడి నెలకొంది. సౌకర్యాల నడుమ విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాశారు. జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాలలో తెలుగు పరీక్ష 25,945 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 24,350 మంది (93.85 శాతం) విద్యార్థులు రాయగా 1,595 మంది విద్యార్థు లు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో బెంచీలు, తాగు నీరు, ఫ్యాన్లు తదితర సౌకర్యాల కల్పించారు. అంతే కాకుండా పలు చోట్ల నీరసించిన విద్యార్థులకు ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని అందించినట్లు డీఈఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎస్పీజీ, బాలికల ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలిసి కలెక్టర్ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాల్‌ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ ఇతర అవకతవకలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఏ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదన్నారు. ఇన్విజిలేటర్లు కూడా మొబైల్ ఫోన్లను బయటే డిపాజిట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

పటిష్ట బందోబస్తు..

పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రం వద్ద నలుగురు పోలీసులను నియమించగా, సమస్యాత్మక పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు నలుగురు పోలీసులను అధికంగా కేటాయించారు. సోమవారం 5 ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు 28 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా, స్టేట్ అబ్జర్వర్ ఆర్‌ఎస్ గంగాభవానీ ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. సమస్యాత్మక కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేక పర్యవేక్షణ చేసినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ప్రశాంతంగా ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

ఓపెన్ పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు సోమవారం నంద్యాల జిల్లాలో 18 కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య సజావుగా నిర్వహించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ తెలిపారు. 10వ తరగతి పరీక్షకు 1,258 మంది విద్యార్థులకు గాను 1,116 మంది విద్యార్థులు హాజరు కాగా 142 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్ష 909 మందికి గాను 806 మంది హాజరు కాగా 103 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఐదు ఫ్లయింగ్‌స్క్వాడ్ టీంలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

అహోబిలేశా నమోస్తుతే!

- కనుల పండువగా అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు
- హంస, సూర్యప్రభ వాహనాలపై దర్శనమిచ్చిన ప్రహ్లాదవరదుడు
- హనుమంత వాహనంపై ఊరేగిన జ్వాలా నరసింహుడు



ప్రత్యేకాలంకరణలో ఉభయ దేవేరులతో శ్రీ జ్వాలా నరసింహుడు



దిగువ అహోబిలంలో హంస వాహనంపై కొలువై మాడ వీధుల్లో విహరిస్తున్న ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ: అహోబిల క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు సోమవారం దిగువ అహోబిలంలో వెలసిన శ్రీ ప్రహ్లాదవరద స్వామి ఉదయం హంస వాహనంపై కొలువై భక్తులను కనువిందు చేశారు. వేకువ జామునే నిత్యపూజల అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకాలంకరణలో ఉన్న హంస వాహనాన్ని అధిష్టించిన ప్రహ్లాదవరదుడు మాడ వీధుల్లో విహరించారు. ఆలయ ప్రాంగణం నుంచి అహోబిల మఠం చేరుకున్న హంస వాహనాధీశుడైన ప్రహ్లాదవరదుడికి అహోబిలేశునికి మఠం పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామిని యాగశాలలో కొలువుంచి పంచామృతాభిషేకం, జలాభిషేకం నిర్వహించి పట్టు పీతాంబరాలతో అలంకరించి కొలువుంచారు. రాత్రి సూర్యప్రభ వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై కొలువైన ప్రహ్లాదవరదుడు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.



హనుమంతుడి వాహనంపై దర్శనమిస్తున్న జ్వాలా నరసింహస్వామి

ఎగువ అహోబిలంలో..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు సోమవారం ఉదయం ఎగువ అహోబిలంలో ఉత్సవ మూర్తులైన శ్రీ జ్వాలా నసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి అమ్మవార్లకు అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో కొలువుంచారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన హనుమంత వాహనంపై జ్వాలా నరసింహుడు కొలువై భక్తులకు దర్శనమిచ్చారు.

ఉద్యోగులూ.. తస్మాత్ జాగ్రత్త!

- ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు
- ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల సంఘం హెచ్చరించింది. వలంటీర్లు కూడా ఎన్నికల విధులకు దూరంగా ఉండటంతో పాటు ప్రచారంలోనూ పాల్గొనరాదని ఆదేశించింది. ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్ల కదలికపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసింది. తెలిసో.. తెలియకో సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ద్వారా ఏదైనా వేదిక కింద పోస్టులు పెడితే ఎవరూ గమనించరు అనుకోవడం పొరపాటు. ఇందుకోసం మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ డేగ కళ్లతో చూస్తోంది. ముఖ్యంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్‌తో పాటు మీడియాలో ఉద్యోగులు, వలంటీర్ల ప్రచార కదలికలు కనిపించినా పట్టేస్తారు.

సమాచారం ఇలా ఇవ్వాలి..

ఉద్యోగులు, వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే ఫిర్యాదు చేయడానికి ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. నేరుగా కర్నూలు జిల్లా టోల్ ఫ్రీ నంబర్ 18004257755 లేదా కాల్ సెంటర్ 08518220125 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

క్లుప్తంగా

కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయండి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల ఫిర్యాదులకు వివిధ మాధ్యమాలను జిల్లా ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచింది. కోడ్ ఉల్లంఘనలు, మద్యం, డబ్బు పంపిణీ, ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎన్నికల ప్రవర్తన నియమావళి) బృందం ఫిర్యాదులను స్వీకరించేందుకు కలెక్టరేట్‌లో సిద్ధంగా ఉంటుంది. ఫిర్యాదులను సీవిజిల్ యాప్‌లో, హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1950, కర్నూలు జిల్లా టోల్ ఫ్రీనంబర్ 08518-220125 లేదా.. ఎంసీసీ మెయిళ్లు mcczppkurnool@gmail.com, cmcknl2024@gmail.comలకు ఫిర్యాదు చేయవచ్చు. ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేసేవారు డీఐపీఆర్-కర్నూలు ట్విట్టర్ అకౌంట్‌కు ఫిర్యాదును ట్యాగ్ చేయవచ్చు.

అనుమతులు తప్పనిసరి



సింగిల్ విండో పర్మిషన్, క్యాండిడేట్ లైజనింగ్ సెల్

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున పార్లమెంటు స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు, రోడ్డుషోలు, లౌడ్ స్పీకర్ల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరని నోడల్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మిని తెలిపారు. కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన సింగిల్ విండో పర్మిషన్, క్యాండిడేట్ లైజనింగ్ సెల్‌ను కలెక్టర్ సృజన ఆదేశాల మేరకు నోడల్ అధికారి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ అనుమతుల కోసం అభ్యర్థులు దరఖాస్తుచేసుకుంటే అన్ని విషయాలను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. అక్కడి నుంచి అనుమతి వచ్చిన తర్వాతే కార్యక్రమాలను నిర్వహించుకోవాలన్నారు.

1, 2 తేదీల్లో జెడ్ఆర్ఈఏఎస్ సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): 2024-25 ఖరీఫ్, రబీ సీజన్‌కు సమాయత్తం అయ్యేందుకు నంద్యాలలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏప్రిల్ 1, 2 తేదీల్లో జెడ్ఆర్ఈఏఎస్ సమావేశాన్ని నిర్వహిస్తోంది. రెండు రోజుల పాటు జరిగే సమావేశంలో కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా వ్యవసాయ అధికారులు(డీఏవోలు), అసిస్టెంట్ డైరెక్టర్లు హాజరవుతారు. ఈ సమావేశం ఖరీఫ్, రబీ పంటల్లో సాగు చేసే ప్రధాన పంటలు, నూతన వంగడాలు తదితరాలపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ యంత్రాంగం చర్చిస్తారని అధికారులు తెలిపారు.

గ్రానైట్ క్వారీ తనిఖీ


గ్రానైట్ క్వారీని తనిఖీ చేస్తున్న మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): కొత్తగా గ్రానైట్ తవ్వకం కోసం కృష్ణగిరి గ్రామ పరిధిలో ఉన్న క్వారీని సోమవారం తనిఖీ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. గ్రానైట్ తవ్వకం కోసం కొత్త ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, సూపర్‌వైజర్ గోవిందరాజులు పాల్గొన్నారు.



కోవెలకుంట్ల: పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు


మహానంది: తిమ్మాపురం కేంద్రం వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు, పాఠశాల సిబ్బంది


మహానంది: కుమార్తెకు సూచనలు ఇస్తున్న తండ్రి


కృష్ణగిరి: జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి వస్తున్న డీఈఓ కె. శామ్యూల్

తొలిరోజు ప్రశాంతం

మొదటి రోజు పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 8.45 గంటలకే వీరిని పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. కేంద్రాల దగ్గర పరీక్షలు రాసే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందడి కనిపించింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యాశాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. -సాక్షినెట్‌వర్క్


కర్నూలు: పరీక్ష కేంద్రం వద్ద తల్లిదండ్రులు విద్యార్థులు


కర్నూలు: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల మాటామంతి


వెల్దుర్తి: కేంద్రంలో పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు


నందికొట్కూరు: ప్రశాంతంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు


కర్నూలు: టౌన్ మోడల్ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రజల భద్రతకు భరోసా

- ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: ఎన్నికల వేళ ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. జిల్లా ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని కర్నూలు, ఆదోని పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలోని పలు సమస్యాత్మక, ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో సోమవారం కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. కర్నూలు నాలుగో పట్టణ సీఐ శంకరయ్య, ఎస్ఐలు మోహన్ కిషోర్, సునిల్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని పందిపాడు, ఇందిరమ్మ కట్ట, ఓల్డ్ కల్లూరు ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ఒకటవ పట్టణ సీఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని పూలబజార్, బండిమెట్ట, ఛత్రబాగ్, గనిగల్లి, పెద్దరంగరాజు వీధి, చిత్తారి వీధి, రాంబొట్ల దేవాలయం, గడ్డ వీధి, జమ్మిచెట్టు, కమేలా, పెద్ద పడఖానా ప్రాంతాల్లో బలగాలు కవాతు నిర్వహించాయి. ఆదోని పట్టణ సీఐ తేజోమూర్తి, ఎస్ఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో హాలహర్వి పోలీస్‌స్టేషన్ పరిధిలో నిత్రావతి, చింతకుంట, మల్లికార్జునపల్లె గ్రామాల్లో, ఆదోని ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమరావతి నగర్, రాంనగర్, పైకొట్టాల, కింది కొట్టాల, ఆదోని తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ ఎర్రిస్వామి ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని నెట్టేకల్లు, చిన్నపెండేకల్లు గ్రామాల్లో కవాతు నిర్వహించి, ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు.


పాత కల్లూరులో స్థానిక పోలీసులతో కలసి కవాతు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

కోడుమూరు: తనిఖీల్లో భారీగా కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ జిల్లా అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎరుకలి మహేంద్ర, మునిస్వామి అనే వ్యక్తులు ఉల్చాలకు చెందిన బోయనాయుడు, పోతుగల్లు కిట్టుతో కలిసి కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తెచ్చి కొంతకాలంగా ఒప్పందంపై వివిధ గ్రామాలకు రహస్యంగా తరలిస్తున్నారన్నారు. సమాచారం మేరకు సెబ్ సీఐ రామాంజినేయులు, జిల్లా అధికారులు, కోడుమూరు పోలీసుల సహకారంతో స్కార్పియో, ద్విచక్రవాహనంలో 81బాక్స్‌ల్లో తరలిస్తున్న రూ.4,90,000 విలువైన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. మద్యం తరలిస్తున్న వాహనాలను సీజ్ చేశామన్నారు. విలేకర్ల సమావేశంలో కోడుమూరు సీఐలు రామాంజనేయులు, మన్సూరుద్దీన్, ఎస్ఐ బాలనరసింహులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న మద్యం, పట్టుబడిన వాహనాలను చూపుతున్న సెబ్ అధికారులు

ఎన్నికల యుద్ధంలో జగనన్నదే విజయం

- చంద్రబాబు శకం ముగిసింది
- పవన్‌ను ప్రజలు పట్టించుకోరు
- జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్



కర్నూలు(టౌన్):సార్వత్రిక ఎన్నికల యుద్ధంలో జగనన్నదే విజయమని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. సోమవారం స్థానిక సి. క్యాంపులోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లపాటు సామాజిక న్యాయం, అన్ని వర్గాలకు సంక్షేమం, మహిళలకు పెద్దపీట వేసిన ముఖ్యమంత్రికి ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయన్నారు. ప్రజల గురించి ఏనాడు ఆలోచించని చంద్రబాబు ఎన్నికల్లో ఇతర పార్టీలపై ఆధార పడటం చూస్తునే ఉన్నామన్నారు. ఒక్కసీటు, ఒక్క శాతం ఓటు బ్యాంకు లేని బీజేపీ, గత ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ఓడిపోయిన పవన్ కల్యాణ్‌తో పొత్తు పెట్టుకున్నారన్నారు. చంద్రబాబుకు రాజకీయ శకం ముగిసిందని, గతంలో మాదిరే పవన్ కల్యాణ్‌ను ఇప్పుడు కూడా ప్రజలు పట్టించుకోరన్నారు. రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సిద్ధం సభలు చరిత్రాత్మకమైనవని, ఈ సభల సక్సెస్ ద్వారానే పార్టీ గెలుపు ఖాయమని తేలిపోయిందన్నారు.

రూ.2.70 లక్షల కోట్లు లబ్ధి చేకూర్చింది నిజం కాదా?

గత ప్రభుత్వంలో ఏనాడైనా ప్రజలకు లబ్ధి చేకూర్చిన దాఖలాలు చూశామా అని ఆయన ప్రశ్నించారు. ఐదేళ్ల జగనన్న పాలనలో కులమతాలకు అతీతంగా, పార్టీలు చూడకుండా ఇంటింటి సంక్షేమం పేరుతో రాష్ట్రంలో అన్ని వర్గాలకు రూ. 2.70 లక్షల కోట్లు లబ్ధి చేకూర్చారన్నారు. జగనన్న పాలనలో ప్రతి ఒక్కరూ ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఎక్కడా అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారీ, అగ్రవర్ణ పేదలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేస్తున్న ఏకైక నాయకుడు జగనన్న అన్నారు.

ప్రజాగళం సభ అట్టర్ ఫ్లాప్

దేశ ప్రధాని, చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ ఉమ్మడిగా నిర్వహించిన ప్రజాగళం సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. మైకులు కూడా సహకరించలేదని ఎద్దేవా చేశారు. ఇలాంటి సభలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఓడిస్తామని ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడుతుంటే మైకులు పనిచేయలేదన్నారు. రాష్ట్ర ప్రజలు మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జగనన్న కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికలు పూర్తయ్యేంత వరకు నిరంతరం సైనికుల్లా పనిచేస్తారన్నారు.

బాలిక, యువకుడి ఆత్మహత్యాయత్నం

మంత్రాలయం/కోసిగి: యువకుడు, బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు.. మంత్రాలయం మండలం చెట్నహళ్లి గ్రామానికి చెందిన బెస్త శివ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ బాలిక ఇష్టపడ్డారు. ఈనేపథ్యంలో ఇరు కుటుంబాల మధ్య గతంలో గొడవలు చోటుచేసుకున్నాయి. పెద్దలు ఇరువురికి సర్ది చెప్పడంతో అవి సద్దుమణిగాయి. కర్నూలులో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలిక పబ్లిక్ పరీక్షలు ముగుంచుకుని ఆదివారం గ్రామానికి చేరుకుంది. సోమవారం ఉదయం నుంచి బాలి క కనపడకపోవడంతో కుటుంబ సభ్యులు మంత్రాలయం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. అంతకమునుపే బెస్త శివ, బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యా దు చేసి విషయం తెలుసుకున్న ఇద్దరూ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రం నుంచి తిరిగి వ స్తూ మార్గ మధ్యలో పురుగు మందు తాగారు. అక్కడి నుంచి మళ్లీ బైక్‌పై బయలుదేరి కోసిగి గ్రామ శివారులో ఉరుకుంద ఆర్చ్ వద్దకు చేరుకున్నారు. పరిస్థితి విషమించడంతో రోడ్డు పక్కన బైక్ నిలిపి బెస్త శివ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముందుగా బాలికను బంధు వులు చికిత్స నిమిత్తం కోసిగి పీహెచ్‌సీకి తరలించారు. అదే సమయంలో కోసిగి ఎస్ఐ సతీష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని శివను పోలీస్ జీపులోనే కోసిగి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండడంతో 108 ఆంబులెన్స్‌లో ఇరువురిని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పాపం.. పసివాడు!

- రోజంతా ఆపరేషన్ థియేటర్లో ఒంటరిగా

కర్నూలు (హాస్పిటల్): ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లోకి పొరపాటుగా వెళ్లిన ఐదేళ్ల బాలుడు రోజంతా అందులోనే ఒంటరిగా ఉండిపోయాడు. బాలుని ఆచూకీ కోసం రోజంతా తిరిగిన తల్లిదండ్రులు ఆపరేషన్ థియేటర్ తెరవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఓర్వకల్లు మండలం తిప్పాయిపల్లె గ్రామానికి చెందిన సుజిత్ అనే ఐదేళ్ల బాలుడు పట్టుకతో మూగ, చెవిటి సమస్యతో జన్మించాడు. అతనికి కాక్లియర్ ఆపరేషన్ చేయించేందుకు గాను తల్లిదండ్రులు ఇటీవల కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఈఎన్‌టీ విభాగంలో చేర్చారు. శనివారం ఆపరేషన్ థియేటర్‌లో వైద్యులకు బాలుడిని తల్లిదండ్రులు చూపించి తీసుకెళ్లారు. ఆదివారం ఆసుపత్రి వైద్యసిబ్బంది ఆపరేషన్ థియేటర్‌ను శుభ్రం చేస్తుండగా బాలుడు ఆడుకుంటూ వచ్చి గదిలో ఉండిపోయాడు. ఈ విషయం తెలియక వైద్యసిబ్బంది థియేటర్ తలుపులకు తాళం వేసుకుని వెళ్లిపోయారు. బాలుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు అన్ని చోట్లా వెతకసాగారు. సోషల్ మీడియాలోనూ బాలుడి గురించి వాకబు చేయించారు. సోమవారం యథాలాపంగా వైద్యసిబ్బంది వచ్చి ఆపరేషన్ థియేటర్ తెరవడంతో బాలుడు బయటకు రావడం కనిపించింది. విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే వచ్చి అక్కున చేర్చుకున్నారు.

ఆదోనిలో దొంగల హల్‌చల్

- రెండు తులాల బంగారం, రూ.50 వేలు నగదు అపహరణ
- నాలుగు హుండీలను ఎత్తుకెళ్లిన దుండగులు


బీరువాను పగలగొట్టి చెల్లాచెదురుగా చేసిన దుండగులు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని దొంగలు హల్‌చల్ సృష్టించారు. సోమవారం తెల్లవారుజామున వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణ అనే వ్యక్తి పనినిమిత్తం రాయచూరుకు వెళ్లగా, ఆయన ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని రెండు తులాల బంగారం, రూ.50 వేలు నగదు, మూడు హుండీలను దొంగలించారు. అదేవిధంగా ఆ ఇంటి ఎదురుగా ఉన్న డాక్టర్ ప్రహ్లాదరావు ఇంటి వాకిలిని పగలగొట్టి మరొక ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించారు. ఉరుకుంద అనే వ్యక్తి పుణ్యక్షేత్రమైన ఉరుకుందకు వెళ్లడంతో తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న హుండీని ఎత్తుకెళ్లారు. బాధితులు ముగ్గురు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా.. ఆదివారం పట్టణశివారులోని రణమండలకొండ సమీపంలో వెలిసిన శివమారుతి ఆలయంలో చోరీ జరిగింది. దుండగులు ఆలయంలో దూరి 350 గ్రాముల వెండి ఆభరణాలను దొంగలించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం రోజునే పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు చెప్పారు.

వేలాడే తీగ మృత్యుపాశమై..

- విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతుడు అయ్యస్వామి(ఫైల్)

గోనెగండ్ల: వేలాడే తీగ మృత్యుపాశమైంది. చిన్నమరివీడు గ్రామానికి చెందిన కురువ అయ్యస్వామి(42) మృతికి కారణమైంది. సీఐ రామకృష్ణయ్య తెలిపిన వివరాల మేరకు.. కురువ అయ్యస్వామికి భార్య కురువ నరసమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం గ్రామంలోని బస్టాప్ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర బావమరిది కురువ వాసు ఏర్పాటు చేసుకున్న చెరకురసం బండి దగ్గరకు వెళ్లి అక్కడ వేలాడుతున్న కరెంట్ తీగను ప్రమాదవశాత్తూ తాకాడు. విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిన అయ్యస్వామిని స్థానికులు ఆటోలో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతుడి భార్య నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చాగలమర్రిలో యువకుడి దారుణహత్య

- పంచాయతీ వేలం పాటలో ఇరువర్గాల ఘర్షణ
- యువకుడిని కత్తితో పొడిచి చంపిన వైనం



మృతి చెందిన ఇమాం, సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలో సోమవారం దారుణ హత్య జరిగింది. పట్టపగలు ఇరువర్గాల వ్యక్తులు ఘర్షణ పడి ఓ యువకుడిని కత్తితో పొడిచి చంపేశారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతు నాయక్ తెలిపిన వివరాల మేరకు.. చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో వారపు సంత, డైలీ మార్కెట్, బస్టాండు, కమేళా తదితర రుసుం వసూలు చేసేందుకు 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి వేలం నిర్వహించేందుకు సోమవారం ఏర్పాట్లు చేశారు. గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓ నాగమణి, ఎంపీడీఓ సుర్యానారాయణరెడ్డి హాజరు కాగా వేలం పాటలో పాల్గొనేందుకు డిపాజిట్ చెల్లించిన నాయబ్‌రసూల్, జహంగీర్‌బాషా, అబ్దుల్ ఖాదర్, ముల్లా రసూల్ అక్కడికి చేరుకున్నారు. కాగా ఆలంసాగారి అబ్దుల్‌ఖాదర్ కుమారుడు దస్తగిరి, ముల్లా రసూల్ కుమారుడు ఇమాం(20) కూడా అక్కడే ఉండటంతో కేవలం డిపాజిట్ దారులు మాత్రమే వేలం పాటలో పాల్గొనాలని కొందరు అభ్యంతరం తెలిపారు. ఈ విషయంపై డిపాజిట్‌దారుల మధ్య మాటా మాటా పెరిగి వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో అధికారులు వేలంపాటను వాయిదా వేసి అందరినీ కార్యాలయం నుంచి బయటకు పంపారు. సమీపంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. ఈ ఘర్షణలో ముల్లా ఇమాంపై కత్తితో దాడి చేశారు. గొంతులో పొడవడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐ హనుమంత నాయక్, ఎస్ఐ రమణయ్య సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. కాగా తమ కొడుకును ఆలంసాగారి అబ్దుల్‌ఖాదర్, అతని కుమారుడు ఆలంసాగారి దస్తగిరి పథకం ప్రకారం హత్య చేశారని తండ్రి ముల్లా రసూల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.